ప్రయాణం.. ప్రతికూలం

- వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు
- అధ్వానంగా మారిన పుంతచెరువు కల్లింగుల రోడ్డు
- కనీస మరమ్మతులు చేపట్టాలని వాహనదారుల వేడుకోలు





రెడ్డిగణపవరం సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న పుంతచెరువు కల్లింగుల రోడ్డు, వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు, రోడ్డులకు మరమ్మతులు నిర్వహించకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. బుట్టాయగూడెం మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలో జల్లేరు వాగుపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. ఈ కల్వర్టు పాడై నెలలు గడుస్తున్నా కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఎన్‌హెచ్‌3 365 బీబీ జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకూ ఉన్న ఈ రహదారిపై నిత్యం పెద్ద వాహనాలు తిరిగేవి. బుట్టాయగూడెం నుంచి జీలుగుమిల్లి మీదుగా తెలంగాణ రాష్ట్రానికి వాహనాలు రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం ఈ కల్వర్టు కొట్టుకుపోవడం వల్ల పెద్ద వాహనాలు తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే స్కూల్ బస్సులు కూడా తిరిగే పరిస్థితి లేదు.

కొట్టుకుపోయిన రోడ్డు

రెడ్డిగణపవరం సమీపంలోని పుంత చెరువు కల్లింగుల రోడ్డు ఇటీవల వర్షానికి కొట్టుకుపోయింది. దీనితో ఆ రోడ్డుపై ప్రయాణం చేయడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చెరువు కింద సుమారు 700 ఎకరాల వరకూ 400 మంది రైతులకు పైగా పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి ఛిద్రంగా మారడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇక గడ్డిబండ్లు, ట్రాక్టర్‌లు, వాహనదారులు అవస్థలు వర్ణనాతీతమని రైతు భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు. అధికారులు స్పందించి కల్వర్టుకు, పుంత చెరువు కల్లింగుల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కోడిపందేలపై దాడులు నిర్వహించారు. మైసన్నగూడెం గ్రామ శివారులో కోడిపందేలపై దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.3వేలు, ఒక కోడి, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని ఉప్పలమెట్టలో నిర్వహించిన దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.12వేలు నగదు, ఒక కోడి, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నలుగురి అరెస్ట్

ఎం.నాగులపల్లి గ్రామ శివారులో ఒక కోడిపందేల స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 2,840 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని స్థానిక విద్యారోహిణీ పాఠశాలలో హరేకృష్ణ మూవెంట్ సంస్థ(హైదరాబాద్) వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత, చిత్రలేఖనంపై పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సామాజిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ వసుంధర, బీజేపీ నేత కొండేపాటి రామకృష్ణ, పిరమిడ్ ధ్యానమందిరం ప్రతినిధి నల్లూరి విజయలక్ష్మి, సోర్న పుణ్యలక్ష్మి, రిటైర్ట్ ఉపాధ్యాయులు వి.మాధవరావు పాల్గొన్నారు.

శివయ్యకు ప్రత్యేక పూజలు



శివయ్యను అలంకరించి పూజలు చేస్తున్న అర్చకులు

లింగపాలెం: కార్తీక మాసం ఆఖరి రోజు సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మండలంలోని ధర్మాజీగూడెం, ఆశన్నగూడెం, బాదరాల, రంగాపురం తదితర గ్రామాల్లోని శివాలయాలను భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిప్రపత్తులతో దీపాలు వెలిగించారు. ధర్మాజీగూడెంలోని శ్రీధర్మలింగేశ్వరస్వామి శివాలయంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు కార్తీక దీపారాధనలు నిర్వహించారు. ధర్మాజీగూడెం శివాలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి అర్చకులు అయిలూరి ఈశ్వర ప్రసాద్ పూజలు నిర్వహించారు.

బిల్డింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



బిల్డింగ్ వర్కర్ల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బిల్డింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం సూరిబాబు అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో రమణారావు మాట్లాడారు. బిల్డింగ్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు ఈనెల 9న మండల, డివిజన్ స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం కార్యదర్శి డి.రాము, బుజ్జి, సూరిబాబు, సీఐటీయూ టౌన్ అధ్యక్షుడు సూర్యరావు, కార్యదర్శి షేక్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి



గవరవరంలో తుపాను జాగ్రత్తల గురించి రైతులకు వివరిస్తున్న ఆర్డీవో రమణ

కొయ్యలగూడెం: తుపాను నేపథ్యంలో పలు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఆర్డీవో ఎంవీ రమణ ఆదివారం పర్యటించారు. ప్రభుత్వ యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలతోపాటు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పొంగుటూరు, పరింపూడి, గవరవరం గ్రామాల్లో ఏవో చెన్నకేశవలతో కలిసి పర్యటిస్తూ వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న పంటను రక్షించుకునే విధానాలను వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ శాఖ విధులు నిర్వహించాలన్నారు. కాలువల వద్ద గస్తీ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు.

పద్మశాలీయుల సమావేశం



పద్మశాలీయుల సంఘం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆదివారం అప్‌లాండ్ చేనేత సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీయుల సంఘ నాయకులు మాట్లాడుతూ శాలిపేట నందు నేతన్న విగ్రహం ఏర్పాటు, కులదైవం భద్రావతి సమేత భావనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి స్థల సేకరణకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో కానూరి శ్రీనివాసరావు, గిడుతూరి రాము, వాసా సత్యనారాయణ, వాసా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు ఐకమత్యంగా ఉండాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జమాత్ ఇస్లాం హింద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజాహిద్

చింతలపూడి: ముస్లింలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని జమాత్ ఇస్లాం హింద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజాహిద్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించి తోటివారికి సహాయపడాలని కోరారు. ఆదివారం చింతలపూడిలో జరిగిన పట్టణ ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చెడు మార్గాన నడిచే వారికి స్వర్గంలో చోటు లేదు అని ఇస్లాం బోధిస్తుందన్నారు. యావత్తు దేశం సర్వ మత సమ్మేళనం అని, పొరుగు వారిని ప్రేమతో ఆదరించడం, ఐకమత్యాన్ని పెంపొందించడం అనేదే ఇస్లాం చెబుతుందని అన్నారు. ముసల్ మాన్ అంటే కలలో కూడా ఇతరులకు హాని చేయని వాడని, చెడు మార్గం వీడి పది మందికి మంచి చేసే మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీమ్ పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.

ఘనంగా కాపు కార్తీక వనసమారాధన



కాపు వనసమారాధనను ప్రారంభిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత



కబడ్డీ ఆడుతున్న బాలలు

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో ఆదివారం కాపు వనసమారాధన నిర్వహించారు. ముందుగా రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలతో కలసి వనసమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాపు నేతలు ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కాపు కల్యాణ మండప ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వనసమారాధనలో అన్ని వర్గాల వారు పాల్గొన్నారు. చిన్నారులు, బాలలు, మహిళలు ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో కల్యాణ మండప ట్రస్టు వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, కార్యదర్శి పల్నాటి బుజ్జి, ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, అంబటి గాంధీ, అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, చిలుకూరి చంద్రం, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, దూలపల్లి ప్రసాద్ తదితరులున్నారు.





కొయ్యలగూడెం: వైఎస్సార్ నగర్‌లో కార్తీక దీపాలంకరణ
కుక్కునూరు: కాశీ విశ్వేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

కార్తీక పూజలు

కొయ్యలగూడెం: వైఎస్సార్ నగర్‌లోని గ్రాండ్ గణేష్ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం కార్తీక దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు శంఖు, చక్ర, ఓంకార స్వస్తిక్ చిత్రాల ఆకృతిలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా దేవతా పారాయణలు నిర్వహించారు.

అమావాస్య ప్రత్యేక పూజలు

కుక్కునూరు: కార్తీక మాసం చివరి రోజు అమావాస్య పురస్కరించుకొని ఆదివారం స్థానిక శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపం, ప్రాతఃకాల అభిషేక పూజలు జరిపారు. సోమవారం శాంతి కళ్యాణం, అన్నదానం, స్వామి వారి ఊరేగింపు ఉంటుందని అర్చకులు నవీన్ శర్మ తెలిపారు.

కూనరం లొద్దిలో మౌలిక సౌకర్యాలు కరువు



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణ

కుక్కునూరు: కుక్కునూరు మండల ఏజెన్సీలో కూనరం లొద్ది గిరిజన గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పేర్కొన్నారు. కూనరం లొద్దిలో ఆదివారం శాఖా కార్యదర్శి మడకం మంగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ గ్రామంలో ఎటువంటి మౌలిక సౌకర్యాలు లేక ఆదివాసీలు దుర్భర పరిస్థితుల్లో బతుకులు నెట్టుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి, తాగునీటి వంటి సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇక్కడ మెడికల్ సిబ్బంది కూడా విజిట్ చేస్తున్న దాఖలాలు లేవని ఆయన తెలిపారు. ప్రధానంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. పిల్లలు 3 కిలోమీటర్ల మేర దూరంలోని ఇసుకపాడులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి కాలినడకన వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు దృష్టి సారించి కూనరం లొద్ది లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, మడివి జోగేష్, రవ్వా అర్జున్, బాబూరావు, మంగ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



కొయ్యలగూడెంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో నిరుపయోగంగా మారిన బస్ షెల్టర్

కొయ్యలగూడెం: మండలంలోని పలుచోట్ల బస్సు షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ వద్ద ముళ్ళపొదలు పెరిగి ప్రయాణికులు కనీసం నిలవడానికి కూడా వీలు లేకుండా మారింది. అదేవిధంగా గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఉన్న బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరింది. జంగారెడ్డిగూడెం వైపు వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా బస్సు షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదేవిధంగా అంకాలగూడెం, నరసన్నపాలెం, గవరవరం, పొంగుటూరు, ఆరిపాటి దిబ్బలు, అచ్యుతాపురం గ్రామాల వద్ద ఉన్న బస్సు షెల్టర్లు ప్రయాణికులకు అణువుగా లేకపోవడంతో ఎండా, వానల్లోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. ప్రధాన రహదారుల పునర్వ్యవస్థీకరణ సమయాల్లో కాంట్రాక్టర్లు 'మమ' అనిపించుకోవడానికి బస్సు షెల్టర్లను నిర్మించారు కానీ వాటిని ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, కన్నాపురం వైపులలో ఉన్న ప్రధాన రహదారుల వద్ద ప్రయాణికులకు అనుకూలంగా బస్సు షెల్టర్లను నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

షష్ఠి ఉత్సవాలకు ముస్తాబు



కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్లో ముస్తాబైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

కొయ్యలగూడెం: షష్ఠి ఉత్సవాలకు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు శరవేగంగా ముస్తాబవుతున్నాయి. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఆలయాల వద్ద కల్యాణోత్సవాలు, మరుసటి రోజు 7వ తేదీ షష్ఠి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బయ్యన్నగూడెంలో ప్రసిద్ధిగాంచిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంతో పాటుగా, కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డు తాడేపల్లిగూడెం రోడ్డులలోని ఆలయాలు, మంగపతి దేవిపేట, బోడిగూడెం, దిప్పకాయలపాడు, కన్నాపురం, రాజవరం, యర్రంపేట, నరసన్నపాలెం, సరిపల్లి తదితర మరో పది గ్రామపంచాయతీల పరిధిల్లో ఉన్న సుబ్బారాయుడి ఆలయాలు, పుట్టల వద్ద ఉత్సవ నిర్వహణ పనులను వేగవంతం చేశారు. టెంపుల్స్ సెంటర్‌లోని మదనగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఆధునీకరించారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరిపై కేసు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. చిన్నంవారిగూడెంలో నిర్వహించిన దాడుల్లో ఒక మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 8 మద్యం సీసాలు, లక్కవరం గ్రామంలో మరో మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి లీటరు సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

4 లీటర్ల సారా స్వాధీనం

బుట్టాయగూడెం: మండలంలోని నిర్వాసిత కాలనీ తూటిగుంటలో పోలవరం ఎక్సైజ్ అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌డీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. సత్యవతి తెలిపారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. సునీల్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ఏపూరి సూరిబాబు మృతి






భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న విజయరాజు, వైఎస్సార్ సీపీ నేతలు, ఏపూరి సూరిబాబు (ఫైల్)

లింగపాలెం: పుప్పాలవారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ సొసైటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఏపూరి సూరిబాబు (72) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సూరిబాబు భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, పార్టీ నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరిబాబు కుమారుడు వెంకట్రావు, కోడలు సుప్రియను పార్టీ నేతలు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సూరిబాబు మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూతలపాటి శ్రీనివాసరావు, నాయకులు ఇనుగంటి సతీష్, కలికినేని రఘు తదితరులు సూరిబాబుకు నివాళులర్పించారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాశి



ప్రగళ్లపాటి కాశి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రగళ్లపాటి కాశీవిశ్వనాధం (కాశి) రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి సంయుక్తంగా తనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు అందాయన్నారు.

అపార్ నమోదులో విద్యార్థులకు ఇక్కట్లు

భీమడోలు: అపార్ ఐడీ నమోదు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లోని చిన్నపాటి తప్పుల కారణంగా విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో భీమడోలు శివారు సూర్యారావుపేటకు చెందిన నోకిరెడ్డి నాగేంద్ర అనే విద్యార్థి బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8న నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు కళాశాల యాజమాన్యం విద్యార్థి నుంచి పరీక్ష ఫీజును వసూలు చేసి నన్నయ విశ్వవిద్యాలయానికి చెల్లించింది. అయితే ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లలో ఇంటిపేరు నోకిరెడ్డికి బదులుగా నూకారెడ్డి అని నమోదు కావడంతో అతని దరఖాస్తును యూనివర్సిటీ తిరస్కరించింది. అదే కళాశాలలో బీఏ విద్యార్థిని కె.మంజుశ్రీ జనన ధ్రువీకరణ పత్రంలో వయస్సు తప్పుగా నమోదు కావడంతో సరిదిద్దుకునేందుకు అవస్థలు పడుతోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈసారి పరీక్షలకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు ప్రిన్సిపాల్ బొమ్ము రవికుమార్ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



కామవరపుకోట: ఆడమిల్లిలో అవగాహన ర్యాలీ



జంగారెడ్డిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న సీఎస్‌టీఎస్ విద్యార్థులు



కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వద్ద ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని, ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో అందరూ భాగస్వాములు కావాలని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మానవహారం నిర్మించారు. అనంతరం విద్యార్థులకు డిబేట్, పోస్టర్ ప్రజంటేషన్, పోస్టర్ మేకింగ్ ప్రజంటేషన్, ఫేస్ పెయింటింగ్, రంగోలి పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ వంతుగా ప్రజలందరికీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 విభాగ అధిపతులు నిట్టా వినయ్, డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.వెంకటలాల్, టి.ఝాన్సీరాణి, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎయిడ్స్ నివారణ మార్గాలను వివరించారు. యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆడమిల్లిలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయ్ కృష్ణ, ఉమ పాల్గొన్నారు.

బయ్యనగూడెంలో ర్యాలీ

కొయ్యలగూడెం: ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.